

ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

● ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్ కాలనీలో పార్కులో 9 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ క్రీడా పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బేగంపేటలో ముస్లిం గ్రేవ్ యార్డ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



జబ్బార్‌ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జబ్బార్‌ఖాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదివారం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇవ్వటంతోపాటు ఆర్థిక సహాయం చేశారు. మృతుడి పిల్లల చదువుకు అండగా ఉంటామని, భార్యకు ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చారు.



కేఎల్ఎన్‌వై పార్కులో వాటర్ కూలర్‌ను ప్రారంభించిన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్, అగర్వాల్ సమితి సభ్యులు

కేఎల్ఎన్‌వై పార్కులో వాటర్ కూలర్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేఎల్ఎన్‌వై పార్కుకు వచ్చే సందర్శకుల కోసం ఎర్రగడ్డ, సనత్‌నగర్‌లోని అగర్వాల్ సమితి ఆధ్వర్యంలో పార్కులో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం ఉదయం పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్కు వాకర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణగౌడ్, ఇన్‌చార్జి సంధ్య, రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దండు మల్లేష్‌గౌడ్, అగర్వాల్ సమితి సభ్యుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న విద్యార్థులతో అవోపా ప్రతినిధులు, అతిథులు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ఖైరతాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ వాసవీ కేంద్రంలో 2024వ సంవత్సరంలో జెఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ తదితర పోటీ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవోపా బ్యాంక్‌మెన్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ఉన్నత చదువు చదువుకుంటే ఉపాధి వెతుక్కుంటూ వస్తుందన్నారు. అవోపా అధ్యక్షుడు పీవీ రమణయ్య, ఉపాధ్యక్షులు టీవీఎల్ రావు, బాబారావు, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, జగ్గయ్య, ప్రతినిధులు కేసీపీ గుప్తా, రమేష్, నరేందర్, రామానందం పాల్గొన్నారు.



రాజయోగిని బీకే వీణను సన్మానిస్తున్న కవయిత్రి డాక్టర్ విజయలక్ష్మి, శిరీష్

సర్వ సమస్యలకు సమాధానం భగవద్గీత

ఎర్రగడ్డ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సర్వ సమస్యలకు సమాధానం భగవద్గీత అని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ రాజయోగిని బీకే వీణ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భగవద్గీత పై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 40 సంవత్సరాలకు పైగా దేశమంతా కొన్ని వందల కార్యక్రమాలు నిర్వహిస్తూ భగవద్గీత ప్రాధాన్యతను వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ మధురానగర్ ఇన్‌చార్జి కవయిత్రి డాక్టర్ బీకే గూడూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. భగవద్గీతపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న సమావేశం ఆదివారంతో ముగిసిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు భగవద్గీత గురించి వివరించారన్నారు. సమావేశంలో బ్రహ్మకుమారీలు ఇందిర, శిరీష, పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విధులకు వెళ్లి వచ్చేలోపు ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి. రాంబాబు, రాజేశ్వరి దంపతులు ఏడేళ్లుగా కార్మికనగర్‌లో నివసిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జూన్ 28వ తేదీన కుమార్తె స్కూల్‌కు, తల్లిదండ్రులు విధులకు వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు రాజేశ్వరి ఇంటికి రాగా తాళం వేసి ఉంది. ఏడో తరగతి చదువుతున్న వారి కుమారుడు కనిపించలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో చదువుకుంటానంటే వద్దన్నామని, అందుకే ఇంటి నుంచి పారిపోయి ఉండవచ్చని ఫిర్యాదులో రాజేశ్వరి పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ సర్కారును దించేందుకు కుట్రలు

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాధినేతల ఆదరణ పొందుతున్న ప్రధాని మోదీ సర్కారును దించేందుకు కొందరు కుట్ర పన్నారని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. లేక్‌వ్యూ బంజారాలో మన్‌కీ బాత్‌లో భాగంగా బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధివైపు నడిపించేందుకు ప్రధాని మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఆయనను ఓడించేందుకు కాంగ్రెస్, ఎంఐఎం లోపాయికార ఒప్పందంతో పనిచేశాయని ఆరోపించారు. బీజేపీని ఓడించాలని లోపాయికార కుట్రలు దేశ వ్యాప్తంగా అనేకం జరిగాయన్నారు. బీజేపీ శ్రేణులు వెనుకడుగు వేయకుండా మోదీ పక్షాన నిలబడి పోరాటం చేయడం గర్వించతగ్గ విషయమన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోలేక రిజర్వేషన్‌ల వ్యవహారాన్ని కాంగ్రెస్ తెరపైకి తీసుకొచ్చిందన్నారు. అబద్ధాన్ని నిజం చేసేందుకు కాంగ్రెస్ అనేక విధాలుగా ప్రయత్నించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రిజర్వేషన్‌లను బీజేపీ ఎత్తేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చేస్తారు అంటూ విమర్శలు చేశారన్నారు. ఇప్పుడు ఆ విషయంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అమలు చేయలేని హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన పథకాలు ప్రజలకు అందకపోతే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణలో బీజేపీకి ఇంతలా ఆదరణ ఎప్పుడూ లభించలేదన్నారు. ప్రజల నమ్మకాన్ని బీజేపీ వమ్ము చేయదన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎం కాంగ్రెస్‌కు పరోక్షంగా సహాయం అందించిందని ఆరోపించారు. దీని పర్యవసానమే మైనారిటీలు అధికంగా ఉన్న నాంపల్లి, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ లభించిందన్నారు. దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు గౌతం రావు, నాయకులు గడ్డం వెంకటస్వామి, బంగారు శృతి, అమర్నాథ్, ఎన్‌వీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు గౌతం రావు తదితరులు

సమాజాన్ని మార్చే శక్తిగా బీసీలు ఎదగాలి

పంజాగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చే శక్తిగా బీసీలు ఎదగాలని ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి అన్నారు. బీసీలు బానిసలుగా బతకకుండా సామాజిక విప్లవం తీసుకురావాలన్నారు. బీసీ టైమ్స్ మరియు బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మార్పు వచ్చినప్పుడే అధికారం మన చేతిలో ఉంటుందని అన్నారు. ఇంతవరకు చాలా కులాలు అసెంబ్లీలో అడుగు పెట్టలేదని, ఇకనైనా సంఘటితంగా అందరూ కలిసిమెలిసి పని చేసినప్పుడే రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. బీసీలకు అధికారం రావాలంటే ఎన్నికల బరిలో నిలవాల్సిందేనని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా సమాజాన్ని మార్చే శక్తిగా బీసీలు ఎదగాలన్నారు. సమావేశంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, బీసీ సమాజ్ యూత్ ప్రెసిడెంట్ పి. సతీష్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్‌తో పాటు కుల, ఉద్యోగ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో బీసీ సంఘాల నాయకులు

21న ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

పంజాగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): షావోలిన్ టైగర్ కుంగ్ ఫూ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నగరంలో మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు జరగనున్నాయి. జూలై 21న యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్‌స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వెయ్యి మందికి పైగా కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో క్రీడాకారులు పాల్గొననున్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ సినీనటుడు సుమన్, తెలంగాణ ఫిలిం చాంబర్ అధ్యక్షుడు పి.రామకృష్ణాగౌడ్, లక్ష్మణ్‌రావుగౌడ్‌తో కలిసి మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్-2024 మెగా కప్ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. మార్షల్ ఆర్ట్స్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, తాను కూడా మార్షల్ ఆర్ట్స్‌ను నిత్యం ప్రాక్టీస్ చేస్తానని తెలిపారు. కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండోలో పోటీలు ఉంటాయని, ఐదు నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు పోటీలో పాల్గొనవచ్చని నిర్వాహకుడు ఎం.కన్నాగౌడ్ తెలిపారు. సమావేశంలో ప్రవీణ్‌గౌడ్, అనుషా రెడ్డి పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

పనసపండ్ల లోడ్‌లో గంజాయి

- ఆంధ్రప్రదేశ్ నుంచి వాహనంలో నగరానికి..
- 8 కిలోల సరుకు, రెండు వాహనాలు, రూ. 50 వేలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ముగ్గురి అరెస్ట్.. పరారీలో ఒకరు

పేట్‌బషీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మత్తును చిత్తు చేసేందుకు ప్రజలంతా భాగస్వాములవుతూ, అధికారులకు సహకరించాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి సరఫరా చేస్తున్న నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఎస్ఓటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్‌తో కలిసి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు మండలానికి చెందిన గేదెల సతీష్(34), కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన కొరాడ సాయికుమార్(26), విశాఖపట్నం చంద్రయ్యపేటకు చెందిన బండారు శివకుమార్(27), ఒడిశాకు చెందిన శివ రాజమండ్రిలో ఉంటూ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పనసపండ్ల లోడ్ మధ్యలో 16 బండిల్స్‌లో 33 కిలోల ఎండు గంజాయి హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. రెండు కిలోమీటర్ల మేర పోలీసుల కదలికలను గమనించేందుకు పైలెట్ వాహనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసే వారికి వీరు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారు. సమాచారం అందుకున్న మేడ్చల్ జోన్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి కరీంనగర్ వెళ్లే రాజీవ్ రహదారిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏపీ 39 యూయూ 4550 వాహనం, ఏపీ 39 హెచ్‌జీ 9909 నంబరు గల కారును తనిఖీ చేశారు. పనసపండ్ల లోడ్‌లో 33 కిలోల గంజాయిని రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హైదరాబాద్ శివారు ప్రాంతంలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొస్తున్నట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.8 లక్షల విలువ చేసే 33 కిలోల గంజాయి, రెండు వాహనాలు, 4 సెల్‌ఫోన్లు, రూ. 50 వేలు స్వాధీనం చేసుకున్నామని, సతీష్, సాయికుమార్, శివకుమార్‌ను అరెస్ట్ చేశామని, శివ పరారీలో ఉన్నాడని డీసీపీ తెలిపారు. సతీష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 4, సాయికుమార్‌పై 2 కేసులున్నాయని, వీరిద్దరూ పాత నేరస్థులన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్ఓటీ, పోలీసులకు త్వరలో రివార్డు అందజేస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

ఎస్ఐ, ఏఎస్ఐకి ఘనంగా వీడ్కోలు

యూసుఫ్‌గూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ ఆదివారం రిటైర్ అయిన ఇక్బాల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రిటైర్‌మెంట్ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదన్నారు. విధుల్లో ఎంతకాలం పనిచేశామన్నది కాదు.. ఎంతవరకు న్యాయం చేశామన్నది, బాధ్యతగా విధులు నిర్వహించామన్నది ముఖ్యమన్నారు. ఇక్బాల్ ఎన్నో సేవలు అందించారని, స్టేషన్‌లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. జూనియర్‌లు సీనియర్లను చూసి బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఇక్బాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాల్‌రాజ్, సాయినాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైరతాబాద్: ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కోటయ్యకు తోటి ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌తోపాటు ఎస్ఐలు, సిబ్బంది కోటయ్య దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు.



ఎస్ఐ ఇక్బాల్‌ను సన్మానించిన ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి



ఏఎస్ఐ కోటయ్య వీడ్కోలు కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సిబ్బంది



గోల్డ్‌మెడల్ చూపిస్తున్న డాక్టర్ వంశీధర్

షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో..

డాక్టర్ వంశీధర్‌కు బంగారు పతకం

పంజాగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో డాక్టర్ వంశీధర్ నాలి హాట్రిక్ గోల్డ్‌మెడల్ సాధించారు. నగరంలో శాట్స్‌రేంజ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని అగ్రశ్రేణి షూటర్లు పాల్గొన్నారు. 10 మీటర్ల రైఫిల్ మాస్టర్‌మెన్ వ్యక్తిగత విభాగంలో 380/400 స్కోర్ సాధించి వంశీధర్ గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. ఇది వరుసగా మూడో గోల్డ్‌మెడల్. ముగింపు కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీజీ అంజనీకుమార్, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సాంఘి, కార్యదర్శి జె.కిరణ్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

జవహర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చావంటే భయమేస్తుంది.. తప్పంత నాదే.. నా చావుకు ఎవరూ బాధ్యులు కారు.. నా తలరాత ఇంతే అంటూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాజీనగర్ ఆనంద్‌నగర్‌లో నివసిస్తున్న రమేశ్(43)జిమ్ కోచ్‌గా పనిచేసేవాడు. సోదరుడు ఆనందరావు ఇంట్లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివసిస్తున్నాడు. రమేశ్‌కు 2011లో స్వాతితో వివాహం అయింది. వీరికి ఒక పాప. స్వాతి ఎనిమిదేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి రమేశ్ ఒంటరిగా ఉంటున్నాడు.

ఆరునెలల నుంచి ఏ పనికీ వెళ్లడం లేదు. జూన్ 29వ తేదీన అన్నం తినడానికి ఆనందరావు కుటుంబ సభ్యులు పిలవగా.. క్రికెట్ మ్యాచ్ చూస్తున్నానని, తరువాత తింటానని చెప్పాడు. 30వ తేదీన రమేశ్ టిఫిన్ తినడానికి కూడా వెళ్లలేదు. దీంతో వదిన భాగ్యలక్ష్మి, ఆమె కుమార్తె రమేశ్ గదికి వెళ్లగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. ఆనందరావు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రమేశ్ (ఫైల్)

యువతితో అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితురాలితో అసభ్యంగా ప్రవర్తించిన యువకులపై చర్యలు తీసుకోవాలని ఓ యువకుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్‌లో నివసించే ఆర్.సాయికుమార్ శనివారం రాత్రి స్నేహితురాలితో కలిసి కాలనీ రహదారిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె చేయి ముట్టుకొని అసభ్యకరంగా మాట్లాడారు. యువకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భగత్‌సింగ్ కాలనీ కార్యవర్గం

బంజారాహిల్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో భగత్‌సింగ్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండు వారాల క్రితం జరిగిన బస్తీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం. సహదేవ్ ఘన విజయం సాధించారు. ఆదివారం బస్తీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లింగాచారి, కోశాధికారిగా ఎం. తిరుపతయ్య, కె. రవిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పి. కిషోర్‌తో పాటు ఉపాధ్యక్షులు, ఉప కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సహదేవ్ మాట్లాడుతూ.. బస్తీలో సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సి. రామచంద్రయ్య, ఎస్సీ శ్రీను, జి. వెంకటేష్, డి. వెంకటస్వామి పాల్గొన్నారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పూర్వ విద్యార్థులు

'నిశుల్క్ ప్రభాత్'లో పూర్వ విద్యార్థుల సందడి

ఖైరతాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న వారు 25 సంవత్సరాల తరువాత ఒకేచోట చేసి సందడి చేశారు. అప్పటి జ్ఞాపకాలు, తరగతి గదుల్లో చేసిన చిలిపి చేష్టలు, ఉపాధ్యాయుల మందలింపులు తలచుకుంటూ ఆడి పాడి ఉల్లాసంగా గడిపారు. ఖైరతాబాద్ మార్కెట్‌లోని నిశుల్క్ ప్రభాత్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 35 మంది పూర్వ విద్యార్థులు హాజరై అప్పట్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుత ఉపాధ్యాయులను, సిబ్బందిని సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, పాఠశాల నిర్వాహక కమిటీ సభ్యులు కిరణ్, రాకేష్ విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌కు నివాళి



జూబ్లీహిల్స్‌లో డి. శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దూడ రవిగౌడ్, నాయకులు

- ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి

కొత్తరకం హాషిష్ డ్రగ్

● ఉత్తరాఖండ్ నుంచి నగరానికి.. ● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. దొరికిన ముఠాను దొరికినట్టే కటకటాల్లోకి నెడుతున్నారు. అయినా, కొత్త, కొత్త స్మగ్లర్స్ పుట్టుకొస్తున్నారు. తాజాగా ఉత్తరాఖండ్ నుంచి హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను గుట్టుగా నగరానికి తీసుకొచ్చిన స్మగ్లర్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్(స్పెషల్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 80 గ్రాముల హాషిష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన రిత్విక్ కొంతకాలం క్రితం ఉత్తరాఖండ్ వెళ్లాడు.

తిరిగి వస్తూ అక్కడ మనుగడలో ఉన్న హాషిష్ అనే మత్తుపదార్థాన్ని తీసుకొస్తున్నాడు. ఆదివారం రైల్లో హాషిష్ డ్రగ్‌తో వస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఎఫ్‌టీ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రావు తన టీమ్‌తోపాటు సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ బృందంతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మాటువేశారు. ఉత్తరాఖండ్ నుంచి రైల్లో సికింద్రాబాద్ చేరుకున్న రిత్విక్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న హాషిష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న హాషిష్ డ్రగ్ స్టిక్స్

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

చాదర్‌ఘాట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న లారీ ముందున్న బైక్‌ను ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్ జిల్లా, వడ్డేపల్లి మండలం, శాంతినగర్ గ్రామానికి చెందిన సోమన్న అలియాస్ శ్యామ్(23) ఇబ్రహీంపట్నంలోని ఏవీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి చైతన్యపురిలో గదిలో ఉంటున్నాడు. పార్ట్ టైమ్‌గా ఉబర్ బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కస్టమర్ వెంకటరమణ ఉబర్ బైక్ బుక్ చేయగా.. సోమన్న బైక్‌పై చైతన్యపురి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తున్నాడు. మలక్‌పేట అక్షయ్ హోటల్ సమీపంలో న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ పిల్లర్‌నంబర్ 1443 వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అదుపు తప్పింది. సోమన్న లారీ వెనుక చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరమణకు స్వల్ప గాయాలయ్యాయి. చాదర్‌ఘాట్ పోలీసులు సోమన్న మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దొంగను పట్టుకున్న ఆర్పీఎఫ్ శక్తిటీం కానిస్టేబుళ్లు

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరిని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి ఆర్పీఎఫ్ శక్తి టీం కానిస్టేబుళ్లు మింజ్, శ్రీలేఖ, డాలీ తనిఖీ చేపట్టారు. రైలెక్కుతున్న ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

● వెనక నుంచి ఢీకొట్టిన లారీ.. మరొకరికి స్వల్పగాయాలు

చాదర్‌ఘాట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. బైక్‌పై వెనక కూర్చున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్ జిల్లా, వడ్డేపల్లి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన సోమన్న అలియాస్ శ్యామ్(23) ఇబ్రహీంపట్నంలోని ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి చైతన్యపురిలోని గదిలో ఉంటున్నాడు. పార్ట్‌టైమ్‌గా ఉబర్ బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం సోమన్న కస్టమర్ వెంకటరమణను బైక్‌పై ఎక్కించుకుని చైతన్యపురి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు. మలక్‌పేట న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ 1443 వద్ద వెనక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సోమన్న రోడ్డుకు కుడివైపు పడిపోగానే లారీ చక్రాలు అతని మీదనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనక కూర్చున్న కస్టమర్ వెంకటరమణ ఎడమ వైపు కిందపడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలియగానే చాదర్‌ఘాట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సోమన్న మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడని పోలీసులు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎస్‌టీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కొత్తరకం హాషిష్ డ్రగ్

కొత్తరకం హాషిష్ డ్రగ్

● ఉత్తరాఖండ్ నుంచి నగరానికి.. ● ఒకరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు రిత్విక్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. దొరికిన ముఠాను దొరికినట్టే కటకటాల్లోకి నెడుతున్నారు. అయినా, కొత్త, కొత్త స్మగ్లర్స్ పుట్టుకొస్తున్నారు. తాజాగా ఉత్తరాఖండ్ నుంచి హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను గుట్టుగా నగరానికి తెచ్చిన స్మగర్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్(స్పెషల్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 80 గ్రాముల హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన రిత్విక్ కొంతకాలం క్రితం ఉత్తరాఖండ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో అక్కడ మనుగడలో ఉన్న హాషిష్ అనే మత్తుపదార్థాన్ని వెంట తీసుకొస్తున్నాడు. ఆదివారం రైల్లో హాషిష్ డ్రగ్‌తో వస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఎఫ్‌టీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రావు తన టీమ్‌తోపాటు సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ బృందంతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మాటువేశారు. ఉత్తరఖండ్ నుంచి వయా ఢిల్లీ ద్వారా రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్న రిత్విక్‌ను అక్కడే మాటువేసిన పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న హాషిష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా స్మగ్లర్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

జవహర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చావంటే భయమేస్తుంది.. తప్పంత నాదే.. నా చావుకు ఎవరు బాధ్యులు కారు.. నా తలరాత ఇంతే అంటూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీనగర్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రమేశ్ (43) జిమ్ కోచ్‌గా పనిచేసేవాడు. తన సోదరుడైన ఆనంద్‌రావు ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉండేవాడు. 2011లో రమేశ్‌కు స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప పుట్టింది. 8 ఏళ్ల క్రితమే స్వాతితో విడాకులు తీసుకున్న రమేశ్ ఒంటరిగానే జీవిస్తున్నాడు. 6 మాసాలుగా ఏ పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తన సోదరుడైన ఆనందరావు ఇంట్లోనే తినేవాడు. జూన్ 29న అన్నం తినాలని ఆనందరావు కుటుంబీకులు పిలవడంతో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నానని.. లేటుగా వస్తానని చెప్పాడు. 30వ తేదీన రమేశ్ టిఫిన్ తినడానికి ఇంటికి రాలేదు. దీంతో వదిన భాగ్యలక్ష్మి, ఆమె కుమార్తె రమేశ్ గదికి వెళ్లడంతో అక్కడ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. వెంటనే వారు ఆనందరావుకు, పోలీసులకు సమాచారం అందించారు. జీవితంపై విరక్తితోనే ఆత్మహత్య చేసుకుని ఉంటారని తెలపడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా..

● రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కూకట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంగా వచ్చి స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన నాగప్ప(70), లక్ష్మి(51)లు బంధువులు. వీరిద్దరు ఆదివారం కూకట్‌పల్లి ఐడీఎల్ రోడ్డులోని రంగనాయకస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు స్కూటీపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ఐడీఎల్ ఎదురుగా వెళ్తున్న వీరి స్కూటీని అతివేగంగా వచ్చిన కారు (టీఎస్ 07 ఇఆర్ 2727) ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే నాగప్ప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మి గాయాలతో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీలో విలీనంతో కంటోన్మెంట్‌కు విముక్తి



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, వికాస్ మంచ్ ప్రతినిధులు, ప్రజలు

మారేడుపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ప్రజలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆదివారం పికెట్ కూడలి వద్ద జరిగిన సంబురాలకు ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రక్షణ శాఖ అధికారులు, మంత్రిత్వ శాఖలతో సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు చర్చించి విలీన ప్రక్రియ ముందడుగు పడే విధంగా కృషి చేశారని, ఇది కాంగ్రెస్ విజయమని అన్నారు. కొన్నేళ్లుగా ఆంక్షల వలయంలో కొట్టుమిట్టాడుతున్న కంటోన్మెంట్‌కు విముక్తి లభించిందని అన్నారు. రెండు, మూడు నెలల్లో విలీన ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. నగరం వలే కంటోన్మెంట్ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. విలీన ప్రక్రియ పూర్తయితే అనేక దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు కార్యక్రమంలో మంచి వికాస్ అధ్యక్షుడు ఈబెల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, కాంగ్రెస్ నాయకులు డీబీ.దేవేందర్, ముప్పిడి మధుకర్, ఎస్.వెంకటేష్, సాంసంగ్ రాజ్, శ్యాంసుందర్‌రెడ్డి, సంతోష్ యాదవ్, ప్రభుగుప్త, సదానంద్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

● శ్రీ గణేష్‌కు కార్ఖానావాసుల వినతి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగణేష్, జంపన తదితరులు

సికింద్రాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడి నివారణకు నూతన పైప్‌లైన్ ఏర్పాటుచేయాలని కార్ఖాన వాసులు కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కార్ఖాన గణేష్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు మొరపెట్టుకున్నారు. బోర్‌వెల్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటుచేయాలని, తద్వారా నీటి ఎద్దడి నివారించవచ్చని తెలిపారు. జంపన ప్రతాప్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీగణేష్ గెలిస్తే అన్నదానం చేస్తామని స్థానికులు మొక్కుకున్నారని, అందుకే తాజాగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్ఖాన బస్తీల్లోని అన్ని సమస్యలను శ్రీగణేష్ పరిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి: తలసాని



సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం అంటేనే బోనాల ఉత్సవాలకు పెట్టింది పేరని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని తన నివాసంలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. జూలై 9న జరిగే బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణం, 21,22 తేదీల్లో జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులు, ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చూడాలని, ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారులకు సహకారం అందిస్తామన్నారు. శంకర్ యాదవ్ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు, ముఖ్యశ్రేణులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బేగంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్ కాలనీలో పార్క్‌లో 9 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ క్రీడా పరికరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బేగంపేటలో ముస్లిం గ్రేవ్‌యార్డ్ నిర్మాణానికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో అన్నదానం

బోయిన్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు వ్యాపారుల అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం డీసీఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌యాదవ్ సోదరుడు, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మార్కెట్‌లోని వర్తకులు, కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉండే వారని స్మరించుకున్నారు. ఆయన మృతి తమకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ గిరిధర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల నగేష్, శంకర్ యాదవ్ సోదరులు నర్సింగ్‌యాదవ్, మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, శైలాబ్ యాదవ్, డీసీఎం అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, జనార్దన్, బీరయ్య పాల్గొన్నారు.



శంకర్‌యాదవ్‌కు నివాళులర్పిస్తున్న మార్కెట్ యార్డు సంఘాల నేతలతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బోయిన్‌పల్లిలో క్రికెట్ విజయోత్సవ సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న జంపన్న ప్రతాప్‌తో పాఠశాల ప్రిన్సిపాల్ బానోతు లాలూ

బోయిన్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీ-20 ప్రపంచ కప్ టోర్నీలో టీమిండియా విజయం సాధించడంతో బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్, ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా, సాయిపద్మజ ఎవెన్యూ కాలనీలో క్రికెట్ అభిమానులు శనివారం అర్ధరాత్రి సంబురాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చి మిఠాయిలు పంచుకున్నారు. జై భారత్, జై జై భారత్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. టీ-20 వరల్డ్ కప్‌ను మరోసారి సొంతం చేసుకున్న టీమిండియా క్రికెట్ జట్టు ఆటతీరు సంతోషాన్ని కలిగించిందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లి, బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ గురుకుల పాఠశాల విద్యార్థులతో సంబరాలు జరుపుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు మిఠాయిలు, స్పోర్ట్స్ డ్రెస్‌లు పంచారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ టీమిండియాకు, క్రికెట్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ ద్రావిడ్ లాంటి కోచ్‌ను, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ లాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజుల్లో టీమిండియా మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

● ప్రొ. గాలి వినోద్ కుమార్

తార్నాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం తార్నాకలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహించి 25 టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, గ్రూప్ 1:100 చొప్పున ఇంటర్వ్యూలు నిర్వహించాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని వారం రోజులుగా గాంధీ ఆస్పత్రిలో ఆమరణ దీక్ష చేస్తున్న ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుడు మోతీలాల్ నాయక్‌ను పరామర్శించినట్టు చెప్పారు. మోతీలాల్ నాయక్ ఆరోగ్యం క్షీణించకముందే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్‌లను నెరవేర్చి దీక్ష విరమింపజేయాలని కోరారు.

రూ. 8 లక్షల విలువ చేసే గంజాయిని పట్టుకున్న పోలీసులు

● 4 సెల్‌ఫోన్‌లు, 2 వాహనాలు, రూ. 50 వేల నగదు, ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మత్తును చిత్తు చేసేందుకు ప్రజలంతా భాగస్వాములవుతూ, అధికారులకు సహకరించాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి సరఫరా చేస్తున్న నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఎస్‌ఓటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్‌లతో కలిసి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు మండలానికి చెందిన గేదెల సతీష్ (34) కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కొరాడ సాయికుమార్(26) విశాఖపట్నం చంద్రయ్యపేటకు చెందిన బండారు శివకుమార్(27), ఒడిస్సాకు చెందిన శివ రాజమండ్రిలో ఉంటూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈజీ మనీ కోసం అలవాటు పడి గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పనసపండ్ల లోడ్ మధ్యలో 16 బండిల్స్‌లో 33 కేజీల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. అయితే ముందు రెండు కిలోమీటర్ల మేర పోలీసుల కదలికలను గమనించేందుకు ఒక పైలెట్ వాహనాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. గంజాయి సరఫరా చేసే వారికి వీరు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారిలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 39 యూయూ 4550 నెంబరు గల వాహనం, ఏపీ 39 హెచ్‌జీ 9909 కారును ఆపి తనిఖీ చేశారు. పనస పండ్ల లోడ్‌లో 33 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించి రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత తమదైన శైలిలో విచారించగా గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ శివారుప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. వీరి నుంచి రూ.8 లక్షల విలువ చేసే 33 కిలోల గంజాయి, రెండు వాహనాలు, 4 సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. నలుగురు నిందితుల్లో శివ పరారీలో ఉండగా, సతీష్, సాయికుమార్, శివకుమార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సతీష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 4, సాయికుమార్‌పై 2 కేసులున్నాయని, వీరిద్దరూ పాత నేరస్తులన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్‌ఓటీ, పోలీసులకు సీపీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. త్వరలోనే వీరికి రివార్డును అందజేయనున్నట్లు డీసీపీ తెలిపారు.



గవర్నర్ సీపీ. రాధాకృష్ణను కలిసిన డాక్టర్ కే.నరసింహన్

గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్‌ను ఆదివారం రాజభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నరసింహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన వివిధ సర్వీస్ చార్జీలు విడుదలయ్యేలా చూడాలని గవర్నర్‌ను కోరారు. బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిని తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో పీసీసీ కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మైనారిటీ నాయకులు జమీల్, పార్టీ సీనియర్ నాయకులు రాజేష్ యాదవ్, గజ్వేల్ భరత్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం టీచర్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్ రావు, కాంగ్రెస్ నాయకులు సరిత, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



గాత్ర కచేరిలో మాస్టర్ జగన్నాథ్ రామ్, తదితరులు

అలరించిన జగన్నాధ్ రామ్ గాత్ర కచేరి

చిలకలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, మీనాక్షి సుందరం హాల్‌లో కళాసాగరం ఆధ్వర్యంలో రేవతి నారాయణన్ మెమోరియల్ జ్ఞాపకార్థం ఆదివారం కర్ణాటక సంగీత కచేరి నిర్వహించారు. జగన్నాథ్ రామ్ కర్ణాటక వాగ్గేయకారుల కీర్తనలు, కృతులు శ్రావ్యంగా గానం చేసి ఆహూతులను ఆకట్టుకున్నాడు. అమెరికాలో నివాసముంటున్న రామ్ ఇక్కడికి వచ్చి గాత్ర కచేరీలో పాల్గొన్నాడు. వయోలిన్ రాజశేఖర్, మృదంగం రామకృష్ణ వాద్య సహకారం అందజేశారు. కళాసాగరం అధ్యక్షుడు జీవీ.సేతురామన్, కార్యదర్శి ఎస్.రామమూర్తి, డీ.వీ. రాఘవాచారి, నల్లాన్ చక్రవర్తి పాల్గొన్నారు.



హరియాణాలోని ఫరియాబాద్‌లో శనివారం జరిగిన బాక్సింగ్ పోటీలో తుకారాంగేట్‌కు చెందిన ఓ ప్రైవేట్ స్కూలు విద్యార్థి జోయల్ స్టాన్లీ డానియల్ మెడల్ సంపాదించాడు. కోచ్ కృష్ణ సలహాతో మెడల్ సాధించానని డానియల్ సంతోషం వ్యక్తం చేశారు. (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)



పదవీ విరమణ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరొచ్చు

● ఏసీపీ వెంకటేశ్వర్లు

రెజిమెంటల్‌బజార్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడం వలన జీవితంలో ఉన్నతస్థాయికి చేరవచ్చని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిబద్ధత, క్రమశిక్షణతో నడుచుకోవాలని అన్నారు. పోలీస్ శాఖలో 35 సంవత్సరాల క్రితం కానిస్టేబుల్‌గా చేరి ఏఎస్‌ఐగా పదవీ విరమణ పొందుతున్న రెడ్డి నాయక్‌ను అభినందించారు. రెడ్డినాయక్‌పై పూలు చల్లుతూ ప్రభుత్వ వాహనంలో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు, ఎస్సైలు సతీష్, బసు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డు ఆఫీసర్‌లు, రెడ్డినాయక్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ప్రధానమంత్రి మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న బీజేపీ నాయకులు

'మన్‌కీ బాత్' తిలకించిన బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలో బీజేపీ నాయకులు తిలకించారు. మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు ఆనంద్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఖయ్యాం, శ్రీధర్, శ్యాముదిరాజ్ తదితరులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని తిలకించారు. క్రీడల్లో మహిళలకు ప్రాధాన్యత పెంచుతామని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధానమంత్రి సందేశం ఇచ్చారని సారంగపాణి తెలిపారు.